సాక్షి
మెదక్
గురువారం । 9 । జనవరి । 2025



కార్డులు సరే.. షాపులేవి?

ప్రభుత్వం కొత్తగా రేషన్ కార్డులు ఇస్తామని ప్రకటించడంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి. ఇదే తరుణంలో దుకాణాలు పెంచాలని కోరుతున్నారు. వివరాలు 8లో ▸



నకిలీ ఏఈ హల్‌చల్

శివ్వంపేట మండల పరిధి లింగోజిగూడలో నకిలీ ఏఈ హల్‌చల్ చేశాడు. విద్యుత్ మీటర్లు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేశాడు. వివరాలు 8లో ▸



నిర్మించారు.. వదిలేశారు

అధికారులు మోడల్ స్కూల్ హాస్టల్ భవనం నిర్మించారు. కానీ ప్రారంభించడం మరిచారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా భవాని



పెద్ద శంకరంపేట(మెదక్): జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పెద్దశంకరంపేటకు చెందిన అవుసుల భవాని నియామకం అయ్యారు. ఈ మేరకు ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ నాయకురాలు అల్కలాంబ, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతరావు బుధవారం నియామకపత్రం అందజేశారు. ఈసందర్భంగా జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

నీటి సరఫరాలో అంతరాయం

నర్సాపూర్: మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న నేపథ్యంలో గురువారం, శుక్రవారం నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాజ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పుల్‌కల్ మండలం చక్రియాల్ వద్ద మిషన్ భగీరథ మెయిన్ పైపులైన్‌కు లీకేజీలు ఏర్పడినందున మరమ్మతులు చేస్తున్నట్లు చెప్పారు. నర్సాపూర్ నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలతో పాటు సంగారెడ్డి జిల్లా జిన్నారం, గుమ్మడిదల మండలాల్లోని గ్రామాలకు నీటి సరఫరా ఉండదని వివరించారు. గ్రామాల్లో స్థానికంగా ప్రజలకు నీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయితీ కార్యదర్శులకు సూచించారు.

ఉగాది బాలల కథల పోటీలకు ఆహ్వానం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

తూప్రాన్: ఉగాది పర్వదినం సందర్భంగా బాలల్లో సాహిత్య అభిరుచి పెంపొందించేందుకు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల నుంచి కథలను ఆహ్వానిస్తున్నామని అక్షర సేద్యం ఫౌండేషన్ కన్వీనర్ వేల్పుల రాజు తెలిపారు. బుధవారం తూప్రాన్‌లో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీయాలనే ఉద్దేశంతో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. వివరాలకు 9701933704 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు వెంకటేష్, రాములు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలి



మాట్లాడుతున్న ఆయిల్‌పామ్ టెక్నికల్ సలహాదారు రంగనాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): అధిక లాభాలు అందించే అయిల్‌పామ్ సాగుకు రైతులు ముందుకురావాలని రాష్ట్ర ఆయిల్‌పామ్ టెక్నికల్ సలహాదారు డాక్టర్ రంగనాయకులు కోరారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో రైతులకు అవగాహన కల్పించారు. ఒకసారి ఆయిల్‌పామ్ సాగు చేస్తే 30 ఏళ్ల వరకు ఆదాయం అందిస్తుందన్నారు. ఎలాంటి భూమిలోనైన పంటను సాగు చేయవచ్చని, అంతర పంటగా కూడ సాగు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. సాగులో తీసుకోవాల్సిన మెలకువలను రైతులకు వివరించారు. ప్రస్తుతం టన్ను ఆయిల్‌పామ్ గెలల ధర రూ. 20 వేల పైనే ఉందన్నారు. అసక్తి ఉన్న రైతులు తమను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ టెక్నికల్ మేనేజర్ కృష్ణ, మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి



ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వం పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంతో పాటు మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, బీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేశం డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద సిబ్బందికి వినతిపత్రాలు అందజేశారు. పంచాయతీ సిబ్బందికి పెండింగ్ వేతనాలు ఇవ్వడంతో పాటు పర్మినెంట్ చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 10 నుంచి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.





ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, పక్కచిత్రంలో మాట్లాడుతున్న ఏఎస్పీ మహేందర్‌రెడ్డి

మత్తుతో భవిష్యత్ చిత్తు

- యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి
- ఏఎస్పీ మహేందర్‌రెడ్డి

హవేళిఘణాపూర్(మెదక్): తెలిసి తెలియని వయసులో చెడుదారిన పడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని.. మంచి లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకెళ్లాలని ఏఎస్పీ మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని మంభోజిపల్లి గీతా హైస్కూల్‌లో పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లు ఓటీపీ చెప్పమని అడిగి డబ్బులు లూటీ చేస్తారని చెప్పారు. ఆన్‌లైన్‌లో అమ్మాయిల ఫొటోలతో ఉన్న ఫేస్‌బుక్ ఖాతాల నుంచి చాటింగ్ చేసి ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తామంటూ బెదిరింపులకు దిగుతారన్నారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే 1903, లేదా సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. అనంతరం క్రైం డీఎస్పీ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ.. మేము పోలీసులం, మీపై కేసు నమోదైంది.. డబ్బులు వేయండి, లేకపోతే అరెస్టు చేస్తామని బెదిరింపు కాల్స్ వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. బాగా చదువుకొని ఉన్నతస్థాయికి ఎదిగి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మెదక్ రూరల్ ఎస్‌ఐ మురళి, షీ టీం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పండుగ పూట పస్తులేనా!

- పారిశుద్ధ్య కార్మికుల ఆవేదన
- మూడు నెలలుగా అందని వేతనాలు
- జిల్లావ్యాప్తంగా 1,679 మంది కార్మికులు

అసలే అంతంతమాత్రంగా వేతనాలు.. ఆపై నెలలు తరబడి బకాయిలు.. పూట గడవక ఇబ్బందులు.. ఆర్థిక కష్టాలతో అప్పులు.. ఇది జిల్లాలోని పారిశుధ్య కార్మికుల దుస్థితి. మూడు నెలలుగా వేతనాలు రాక ఆందోళన చెందుతున్నారు. సంక్రాంతికి పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మెదక్‌లో చెత్తను సేకరిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

మెదక్‌జోన్: జిల్లాలో 493 గ్రామాలు ఉండగా.. గత ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన మల్టీపర్పస్ వర్కర్ల నియామకానికి చర్యలు చేపట్టింది. 500 జనాభాకు ఒకరి చొప్పున, జిల్లావ్యాప్తంగా 1,679 కార్మికులను నియమించింది. గ్రామానికి ఒకటి చొప్పున 469 ట్రాక్టర్లు, వాటర్ ట్యాంకర్లను కొనుగోలు చేసింది. పారిశుద్ధ్య కార్మికులకు నెలకు రూ. 9,500 చొప్పున వేతనం ఇస్తామని చెప్పింది. అప్పటి నుంచి గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికి తిరిగి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంప్‌యార్డుకు తరలిస్తున్నారు. అంతే కాకుండా నిత్యం గ్రామంలో మురికి కాలువలు, రోడ్లు, పాఠశాలలు శుభ్రం చేస్తున్నారు. కొత్తగా ఎవరైనా నల్లా కనెక్షన్ కావాలంటే గుంతలు తీస్తున్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలకు నిత్యం నీరు పోయడం, రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పంచాయతీ కార్యదర్శుల వెంట నడుస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే గ్రామాల ప్రగతిలో కీలకపాత్ర పోషిస్తున్నారు. అయితే మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఆందోళనలో పడ్డారు. సంక్రాంతి పండుగకు కిరాణా సామగ్రి కొనలేని పరిస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడాదికోసారి జరుపుకునే పండుగకైనా వేతనాలు ఇవ్వాలని ఆయా మండలాల్లో ధర్నాలు నిర్వహిస్తున్నారు. సంబంధిత అధికారులకు వినతిపత్రాలను అందజేస్తూ నిరసన తెలుపుతున్నారు. అయితే 95 శాతం మంది కార్మికులు నిరుపేదలే. నిత్యం రెక్కాడితే గాని డొక్కాడని బతుకులు వారివి. కరోనా సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం వేతనాలు సరిగా రాక ఆర్థికలితో అలమటిస్తున్నారు.

పూట గడవడం లేదు



మూడు నెలలుగా జీతం రాకపోవడంతో పూట గడవడం ఇబ్బందిగా మారింది. రానున్న సంక్రాంతి పండుగకు అయినా వేతనం ఇస్తారో లేదోనని భయంగా ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం తమ గురించి ఆలోచించి వేతనాలు ఇచ్చి ఆదుకోవాలి.


– పద్మయ్య, పారిశుద్ధ్య కార్మికుడు

మల్లన్న సాగర్.. వాటర్ హబ్

ఇప్పటికే నాలుగు జిల్లాలకు తాగునీరు

- ఏప్రిల్ వరకు మరో 1,160 ఆవాసాలకు..
- నగరానికి 20 టీఎంసీల నీరు తరలింపునకు ప్రణాళికలు

సాక్షి, సిద్దిపేట: కొమురవెల్లి మల్లన్నసాగర్ సాగు, తాగు నీటిని అందిస్తూ వాటర్ హబ్‌గా నిలుస్తోంది. ఇప్పటికే నాలుగు జిల్లాలోని 22 మండలాలకు తాగునీటిని అందిస్తుండగా, ఈ ఏడాది ఏప్రిల్ వరకు మరో 7 అసెంబ్లీ నియోజకవర్గాలోని 1,160 ఆవాసాలకు సైతం నీటిని అందించనుంది. హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం ఇక్కడి నుంచే 20 టీఎంసీల నీటిని తరలించాలని ఇటీవల మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. అందుకు ప్రణాళికలను సైతం రూపొందిస్తున్నారు. తొగుట, కొండపాక మండల పరిధిలో 50టీఎంసీల సామర్థ్యంతో కొమురవెల్లి మల్లన్నసాగర్ రిజర్వాయర్‌ను నిర్మించారు. ఈ రిజర్వాయర్‌ను ఫిబ్రవరి 2022లో అప్పటి సీఎం కేసీఆర్ ప్రారంభించారు. కుకునూరుపల్లి మండలం తిప్పారం వద్ద ఆరు మోటార్ల ద్వారా 5.6కిలో మీటర్ల పైప్‌లైన్‌తో మంగోల్‌లోని వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు మొదట నీటిని చేరుస్తున్నారు. అక్కడ 270 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్ ఫర్ డే) సామర్థ్యంతో రెండు ట్రీట్‌మెంట్ ప్లాంట్లను నిర్మించగా ఒక దాని నుంచి శుద్ధి చేసిన తాగునీటిని అందిస్తున్నారు. జూన్ 2023 నుంచి స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ, పాలకుర్తి, సిద్దిపేట, తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గాలకు శుద్ధి చేసిన గోదావరి జలాలను అందిస్తున్నారు. ఈ నియోజకవర్గాలలో 22 మండలాల్లోని 870 ఆవాసాల్లో 2.10లక్షల నల్లా కనెక్షన్లకు తాగునీటిని రోజుకు 170 ఎంఎల్ (మిలియన్ లీటర్లు ఫర్ డే) పంపింగ్ చేస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ చివరి వరకు ఆలేరు, భువనగిరి, దుబ్బాక, గజ్వేల్, మేడ్చల్, నర్సాపూర్, నకిరేకల్ నియోజకవర్గాలోని 1,160 ఆవాసాలకు 3.03లక్షల నల్లాల ద్వారా తాగునీటిని అందించనున్నారు.



నీటిని తరలించేందుకు ప్రణాళికలు..

మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు 20 టీఎంసీల నీటిని తరలించేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నారు. అందులో హైదరాబాద్ తాగునీటి కోసం 15 టీఎంసీల నీటిని, మరో ఐదు టీఎంసీలు మూసీ పునరుజ్జీవంలో భాగంగా ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ తరలించనున్నారు. తిప్పారం నుంచి నేరుగా మేడ్చల్ జిల్లాలోని ఘన్‌పూర్‌కు రా వాటర్‌ను తరలించే అవకాశం ఉంది. ఘన్‌పూర్ కొండ కింద ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను.. కొండమీది నుంచి పంపింగ్ పాయింట్ ద్వారా శుద్ధిచేసిన నీటిని హైదరాబాద్‌కు తరలించనున్నారు. ఇందుకోసం రూ.7,360 కోట్ల నిధులను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌కు తాగునీటిని అందించేందుకు డీపీఆర్ సిద్ధం చేస్తున్నారు.

భవిష్యత్ అవసరాల దృష్ట్యా..

హైదరాబాద్‌లో రోజురోజుకు జనాభా పెరుగుతుండటంతో వారి అవసరాలకు సరిపడే విధంగా భవిష్యత్తులో తాగునీటి కొరత ఉండవద్దనే ఉద్దేశ్యంతో మల్లన్నసాగర్ నుంచి నీటిని ప్రభుత్వం తరలిస్తోంది. నగరంలో సుమారు 14 లక్షలకు తాగునీటి కనెక్షన్లు ఉండగా రోజు 565 ఎంజీడీ (మిలియన్ గ్యాలన్స్ ఫర్ డే) నీటిని సుమారుగా 25టీఎంసీల నీటిని అందిస్తున్నారు. అయితే 2050 నాటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని అదనంగా నీటి సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: గురుకులాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ కోటాలో 60 వేల సీట్ల భర్తీకి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5 నుంచి 9వ తరగతులలో ఖాళీలు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. టీజీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్ ఖమ్మం, పరిగి ఎస్‌ఓఈలలో 8వ తరగతి ప్రవేశాలు, టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ రుక్మాపూర్ సైనిక్ స్కూల్, మల్కాజ్‌గిరి ఫైన్ ఆర్ట్స్ పాఠశాలలో ప్రవేశాలకు 2025– 26 విద్యా సంవత్సరానికి గాను కామన్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. పూర్తి సమాచారం కోసం సంబంధిత వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు



దేవాలయ భూములను పరిశీలిస్తున్న అధికారులు

నర్సాపూర్: ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని డీఆర్‌డీఓ శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం పలు శాఖల అధికారులతో కలిసి నర్సాపూర్, మెదక్ జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న దేవాలయ భూములను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సాపూర్‌లో వంద ఎకరాల దేవాలయ భూములు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సబ్‌స్టేషన్ నుంచి రెండున్నర కిలోమీటర్ల దూరంలో భూములు ఉన్నందున ప్లాంట్ ఏర్పాటుకు అనువుగా ఉన్నాయని అన్నారు. నర్సాపూర్‌లో వంద ఎకరాల్లో ప్లాంట్ ఏర్పాటు చేస్తే 25 మెగావాట్ల సోలార్ పవర్ ఉత్పత్తి అవుతుందన్నారు. కాగా దేవాలయ భూముల వివరాల నివేదికను కలెక్టర్ త్వరలోనే ప్రభుత్వానికి పంపుతారని వివరించారు. కాగా నర్సాపూర్‌లోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయానికి 148 ఎకరాల భూములు ఉన్నాయని, వాటిలో వంద ఎకరాల్లో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు అనువుగా ఉన్నట్లు ఈఓ సార శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఎస్‌ఈ శంకరయ్య, తహసీల్దార్ శ్రీనివాస్, ఈఓ సార శ్రీనివాస్, ఆర్‌ఐ సిద్దిరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.80 లక్షలు చెల్లించాలి

ట్రిపుల్‌ఆర్ భూ నిర్వాసితులు



పరిహారం చెల్లింపుపై భూ నిర్వాసితులతో చర్చిస్తున్న అధికారులు

నర్సాపూర్ రూరల్: ఎకరాకు రూ. 80 లక్షల పరిహారం చెల్లించాలని ట్రిపుల్‌ఆర్ భూ నిర్వాసితులు అధికారులను కోరారు. బుధవారం మండలంలోని రెడ్డిపల్లి పంచాయతీ కార్యాలయంలో ఆర్డీఓ మహిపాల్, తహసీల్దార్ శ్రీనివాస్ పరిహారం చెల్లింపుపై రైతులతో చర్చించారు. ఎకరాకు రూ. 42 లక్షల పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వివరించారు. అనంతరం నిర్వాసితులు మాట్లాడుతూ.. గతంలో కాళేశ్వరం కాలువ ఏర్పాటు కోసం సుమారు 180 ఎకరాల వ్యవసాయ భూములు కోల్పోయామని, అతి తక్కువ పరిహారం రూ. 12 లక్షలు చెల్లించడంతో తీవ్రంగా నష్టపోయినట్లు గుర్తుచేశారు. దీనికి తోడు ఛత్తీస్‌గఢ్ విద్యుత్ లైన్‌తో మరింత నష్టం జరుగుతుందని అధికారులతో మొరపెట్టుకున్నారు. ప్రస్తుతం ట్రిపుల్ ఆర్ కోసం 34 ఎకరాలు కోల్పోతున్నామని వివరించారు. రెడ్డిపల్లి భూ నిర్వాసితుల కోసం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి ఎకరాకు రూ. 80 లక్షల పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రెడ్డిపల్లి భూ నిర్వాసితులు, అధికారులు పాల్గొన్నారు.

పాఠకుల సమస్యలు పరిష్కరిస్తాం

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న సుహాసినిరెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రంథాలయాల్లో పాఠకుల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి అన్నారు. బుధవారం కౌడిపల్లి శాఖా గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంశీకృష్ణతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. త్వరలో సొంత భవనంలోనికి లైబ్రరీని మారుస్తామని తెలిపారు. బీసీ కమ్యూనిటీ హాల్‌లో ఎలాంటి సదుపాయాలు లేక పాఠకులు ఇబ్బంది పడతున్నట్లు గుర్తించామన్నారు. గ్రంథాలయ భవనంలో కొనసాగుతున్న పీఆర్ డివిజన్ కార్యాలయాన్ని మరో భవనంలోకి మార్చేందుకు గానూ వ్యవసాయశాఖ ఏఓ, ఐకేపీ ఉత్పత్తిదారులు సంఘం కార్యాలయాలను పరిశీలించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయడంతో కౌడిపల్లికి చెందిన విద్యార్థులు జిల్లా గ్రంథాలయానికి వెళ్లి చదువుకుంటున్నారని చెప్పారు. మెరుగైన వసతులు కల్పించి నిరుద్యోగులకు అండగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ ప్రభాకర్, ఏఈ మారుతి, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



పోలీస్ సిబ్బందికి ట్యాబ్‌లు అందిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించి మాట్లాడారు. డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐ, ఏఎస్‌ఐ, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్, హోంగార్డు ఇలా హోదాలను పక్కన పెట్టి తమ జట్టును గెలిపించుకునేందుకు కలిసికట్టుగా పోరాడాలని సూచించారు. జిల్లాలో మూడోసారి స్పోర్ట్స్ మీట్‌ను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడాపో టీలకు జిల్లా తరఫున పంపిస్తామని వివరించారు. అంతకుముందు పోలీస్ అధికారులతో ఎస్పీ నేరాలపై సమీక్ష నిర్వహించారు. ఇంటర్– ఆపరబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. జిల్లాలోని పోలీస్‌స్టేషన్లకు అందించిన ట్యాబ్‌ల ద్వారా ఐసీజేఎస్ పోర్టల్‌లో ఏడేళ్లు అంతకంటే ఎక్కువ శిక్ష గల నేరాలకు సంబంధించిన అంశాలను అప్‌లోడ్ చేయాలన్నారు. మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, టౌన్ సీఐ నాగరాజు, అల్లాదుర్గ్ సీఐ రేణుకారెడ్డి, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

కలెక్టర్ రాహుల్‌రాజ్



సంచార చేపల విక్రయ వాహనాన్ని మహిళకు అందజేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్‌జోన్: మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా సంచార చేపల విక్రయ వాహనాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళలు వారి కాళ్ల మీద వారే నిలబడాలన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకంలో మీ సేవ, పౌల్ట్రీ, నాటు కోళ్ల పెంపకం, క్యాంటీన్లు, ఇతర 20 రకాల యూనిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ ఏడాది రూ. 100 కోట్లు లక్ష్యంగా పెట్టుకొని మహిళలకు పంపిణీ చేస్తున్నామన్నారు. మెప్మా ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటులో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు కృషి హర్షనీయమని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్డీఏ శ్రీనివాసరావు, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో అధికారుల పాత్ర కీలకం

మెదక్ కలెక్టరేట్: మండలాల అభివృద్ధిలో అధికారుల పాత్ర కీలకమని కలెక్టర్ అన్నారు. బుధవారం రాత్రి కలెక్టరేట్‌లో పలు అంశాలపై అధికారులతో చర్చించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. బాల్య వివాహాలు జరగకుండా చర్యలు చేపట్టాలని, మహిళా సంఘాలకు సోలార్ ప్లాంట్ల ఏర్పాటులో భాగంగా భూమిని గుర్తించడంలో కృషి చేయాలని సూచించారు. అంతకుముందు జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయిలో విద్యార్థిని ప్రతిభ


శీర్షికను సన్మానించిన ఎంఈఓ

తొగుట(దుబ్బాక): మండలంలోని ఘనపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని పులగూర్ల శీర్షిక రాష్ట్ర స్థాయి జీవశాస్త్రం టాలెంట్‌ టెస్ట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చింది. ఇటీవల హైదరాబాద్‌లో ఈ పోటీలు నిర్వహించగా ద్వితీయ స్థానంలో నిలిచింది. పాఠశాల హెచ్‌ఎం అంజలి, జీవశాస్త్రం ఉపాధ్యాయుడు నవీన్‌కుమార్‌, విద్యార్థి శీర్షికను ఎంఈఓ నర్సయ్య అభినందించి సన్మానించారు.

స్వాతంత్య్ర సమరయోధురాలు మృతి


లచ్చవ్వ (ఫైల్‌)

మద్దూరు(హుస్నాబాద్‌): దూళ్మిట్ట మండలంలోని బైరాన్‌పల్లి గ్రామానికి చెందిన స్వాతంత్య్ర సమరయోధురాలు జంగిటి లచ్చవ్వ(95) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందింది. 1948లో బైరాన్‌పల్లిలో రజాకార్లకు వ్యతిరేకంగా సాగిన సాయుధ పోరాటంలో లచ్చవ్వ పాల్గొంది. లచ్చవ్వకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా సాయుధపోరాట యోధులకు లభించే ప్రత్యేక గుర్తింపు, పింఛన్‌ లచ్చవ్వకు అందలేదు. ఆమె మృతిపై గ్రామస్తులు సంతాపాన్ని వ్యక్తం చేశారు.

రేషన్‌ బియ్యం స్వాధీనం

దుబ్బాకటౌన్‌: అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్‌ బియ్యాన్ని పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. రాయపోల్‌ ఎస్సై రఘుపతి కథనం మేరకు.. రాయపోల్‌ మండలం రామారం గ్రామానికి చెందిన ఎలగందుల సతీశ్‌ పాత ఇంట్లో 19 బస్తాలు, 12.80 క్వింటాళ్ల రేషన్‌ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచాడు. నమ్మదగిన సమాచారం ప్రకారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు, రాయపోల్‌ పోలీసులు బుధవారం ఆ ఇంటి పై దాడి చేసి నిల్వ ఉంచిన రేషన్‌ బియ్యాన్ని పట్టుకున్నామన్నారు. ఆర్‌ఐ భాను ప్రకాశ్‌ పంచనామ నిర్వహించి అనంతరం సతీశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. అనంతరం రేషన్‌ బియ్యాన్ని దౌల్తాబాద్‌ పౌరసరఫరాల గోదాంకు తరలించామన్నారు.

350 క్వింటాళ్లు..

మునిపల్లి(అందోల్‌): అక్రమంగా తరలిస్తున్న రేషన్‌ బియ్యాన్ని సివిల్‌ సప్లయ్‌ అధికారులు పట్టుకున్నారు. బుదేరా పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. హైద్రాబాద్‌ నుంచి గుజరాత్‌కు లారీలో బియ్యం తరలిస్తుండగా కంకోల్‌ టోల్‌ ప్లాజా సమీపంలో సివిల్‌ సప్లయ్‌ అధికారులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇందులో 350 క్వింటాళ్ల బియ్యం పట్టుబడగా సదాశివపేట గోదాంకు తరలించినట్లు తెలిపారు. అధికారులు ఇంకా ఫిర్యాదు చేయలేదని, పూర్తి సమాచారం తెలియాల్సి ఉందన్నారు.

అత్యాచారం కేసులో ఇద్దరు రిమాండ్‌

చేగుంట(తూప్రాన్‌): గిరిజన తండాలో జరిగిన అత్యాచారం కేసులో నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ చైతన్యకుమార్‌ రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. మాసాయిపేట మండలం నడిమితండాలో 3న అర్ధరాత్రి పూరి గుడిసెలో నిద్రిస్తున్న ఓ బాలికపై తండాకు చెందిన ప్రవీణ్‌తోపాటు చెట్ల తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన బందెల రాజు లు అత్యాచారానికి పాల్పడ్డారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపిన పోలీసులు, నిందితులిద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

బైండోవర్‌ నిబంధనలు ఉల్లంఘన

వ్యక్తికి రూ.5 వేలు జరిమానా

అక్కన్నపేట(హుస్నాబాద్‌): బైండోవర్‌ నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తికి జరిమానా విధించినట్లు ఎక్సైజ్‌ శాఖ సీఐ పవన్‌ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని రామవరం గ్రామానికి చెందిన దిడిగం రవితేజ గతంలో తన కిరాణా దుకాణంలో గుడుంబా తయారీదారులకు బెల్లం, పటికలు సరఫరా చేస్తూ పట్టుబడడంతో తహసీల్దార్‌ ఎదుట బైండోవర్‌ చేశాం. ఇటీవల మరోసారి బెల్లం, పటిక సరఫరా చేస్తూ చేర్యాల స్టేషన్‌లో పట్టుబడ్డాడు. బైండోవర్‌ నిబంధనలు ఉల్లంఘించినందుకు తహసీల్దార్‌ అనంతరెడ్డి ఆదేశాల మేరకు సదరు వ్యక్తికి రూ.50 వేల జరిమానా విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

కార్డులు సరే.. షాపులేవీ?

ప్రభుత్వం కొత్తగా రేషన్‌ కార్డులు ఇస్తామని ప్రకటించడంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి. ఇదే తరుణంలో దుకాణాలు కూడా పెంచాలని కోరుతున్నారు. రేషన్‌ దుకాణంలో పరిమితికి మించి కార్డుదారులు ఉండటం, సరుకులు తెచ్చు కోవడానికి దూర భారం కావడంతో ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 30 వేలపైగానే జనాభా ఉన్న హుస్నాబాద్‌ పట్టణంలో కొన్నేళ్లుగా 8 రేషన్‌ దుకాణాలతోనే బియ్యం, సామగ్రి పంపిణీ చేస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.



- హుస్నాబాద్‌లో వేధిస్తున్న రేషన్‌ షాపుల కొరత
- ప్రభుత్వం కార్డులు ఇస్తామనడంతో లబ్ధిదారుల్లో చిగురించిన ఆశలు
- ఇదే తరుణంలో దుకాణాలు పెంచాలంటూ డిమాండ్‌
- ఏళ్ల కొద్దీ 8 షాపులతోనే నిర్వహణ
- నరుకుల కోసం తప్పని దూరభారం

హుస్నాబాద్‌: హుస్నాబాద్‌ పట్టణంలో 2006 సంవత్సరంలో ఉన్న 8 రేషన్‌ దుకాణాలనే ఇప్పటి వరకు కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 500 జనాభా దాటితే మరో రేషన్‌ దుకాణం ఉండాలి. మున్సిపాలిటీ పరిధిలో తెలుపు రేషన్‌ కార్డులు 5,336, అంత్యోదయ కార్డులు 429 ఉన్నాయి. ప్రస్తుతం తెలుపు రేషన్‌ కార్డు ఉన్న వారికి ప్రతి నెలా ఒక్కొక్కరికి 6 కిలోలు, అంత్యోదయ కార్డులు ఉన్న వారికి 35 కిలోల బియ్యం ఉచితంగానే పంపిణీ చేస్తున్నారు.

కార్డుల కోసం ఎదురుచూపులు

ప్రస్తుతం రేషన్‌ దుకాణాల ద్వారా దొడ్డు బియ్యం ఇస్తుండటంతో లబ్ధిదారులు తినకుండా కిలోకు రూ.10 నుంచి రూ.15 వరకు దళారులకు అమ్ముతున్నారు. ఇవే బియ్యాన్ని మార్కెట్‌లో కిలోకు దాదాపు రూ.35 అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీంతో దళారులు లాభపడుతున్నారని ప్రభుత్వం భావించింది. త్వరలోనే రేషన్‌ దుకాణాల ద్వారా సన్న బియ్యం సరఫరా చేస్తామని ప్రకటించడంతో చాలా మంది రేషన్‌ కార్డులకు కోసం ఎదురు చూస్తున్నారు. హుస్నాబాద్‌ పట్టణంలో ప్రజా పాలనలో రేషన్‌ కార్డుల కోసం దాదాపు 1,000 మందికి పైగా దరఖాస్తులు చేసుకున్నారు. ఏ సంక్షేమ పథకం లబ్ధిపొందాలన్న తెలుపు రేషన్‌ కార్డును ప్రామాణికం చేయడంతో వందలాది మంది కొత్త రేషన్‌ కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు.

దూర భారంతో అవస్థలు...

హుస్నాబాద్‌ పట్టణంలో 8 రేషన్‌ దుకాణాలు ఉన్నాయి. ప్రస్తుతం దుకాణాలు తక్కువగా ఉండటం, రేషన్‌ దారులు ఎక్కువ ఉన్నారు. కొన్ని దుకాణాల్లో వెయ్యికి పైగా రేషన్‌ కార్డు దారులు రేషన్‌ సరుకులు తీసుకుంటున్నారు. కొన్ని దుకాణాలకు వెళ్లాలంటే దాదాపు 2 కి.మీ దూరం వెళ్లాల్సి వస్తుంది. జనాభాకు తగ్గట్టుగా రేషన్‌ దుకాణాలు లేకపోవడం, దుకాణాలు దూరంగా ఉండటంలో లబ్ధిదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికే పట్టణంలో మరిన్ని రేషన్‌ దుకాణాలు పెంచాలని స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ప్రజల నుంచి విజ్ఞప్తులు వచ్చాయి. ప్రస్తుత జనాభా ప్రకారం 10 నుంచి 15 వరకు దుకాణాలు పెంచాల్సి ఉంటుంది. కొత్త రేషన్‌ కార్డులు, దుకాణాలు పెంచే విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదని తహసీల్దార్‌ రవీందర్‌ రెడ్డి తెలిపారు.

దుకాణాలు పెంచాలి



కొన్నేళ్ల నుంచి కొత్త రేషన్‌ దుకాణాలు ఏర్పాటు చేయడం లేదు. ఉన్న దుకాణాలు దూరంగా ఉండటంతో సరుకులు తెచ్చుకోవడానికి ఇబ్బంది పడుతున్నాం. జనాభాకు తగ్గట్లుగా దుకాణాలు పెంచాలి. నిరుద్యోగ యువతను గుర్తించి వారిని డీలర్లుగా నియమించినట్లయితే ఉపాధి కల్పించడంతోపాటు కుటుంబ పోషణకు ఉపయోగపడుతుంది. సరుకుల పంపిణీలో సమయపాలన పాటించే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కవ్వ వేణుగోపాల్‌ రెడ్డి, హుస్నాబాద్‌

తనయుడి జాడ కోసం వెళ్తుండగా..

ఎదురొచ్చిన మృత్యువు

- రైలు ఢీకొని తండ్రి మృతి
- అక్కన్నపేట రైల్వేస్టేషన్‌లో ఘటన


నర్సింలు (ఫైల్‌)

రామాయంపేట(మెదక్‌): ఆత్మహత్య చేసుకుంటానని స్నేహితుడికి ఫొటో లు పంపిన కొడుకు ఆచూకీ కోసం వెళ్లిన తండ్రి రైలు ఢీకొని మృతి చెందిన ఘటన మెదక్‌ జిల్లా రామాయంపేట మండలం అక్కన్నపేట రైల్వేస్టేషన్‌ సమీపంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. మృతుడు కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం భాగిర్తిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి. వివరాల్లోకి వెళ్తే.. భాగిర్తిపల్లి గ్రామానికి చెందిన గంగయ్య గారి నర్సింలు (48) ఆయన కుమారుడైన రాజశేఖర్‌లకు వారి దాయాది అయిన గంగయ్యగారి స్వామితో మంగళవారం భూమి విషయమై గొడవ జరిగింది. ఈ విషయమై స్వామి భిక్కనూరు పోలీసులకు నర్సింలు, రాజశేఖర్‌లపై ఫిర్యాదు చేశాడు. తర్వాత అదే రోజు మధ్యాహ్నం నర్సింలు, కొడుకు రాజశేఖర్‌ మధ్య కూడా గొడవ జరిగింది. ఈ నేపథ్యంలోనే నర్సింలు భిక్కనూరు పోలీస్‌స్టేషన్‌లోకుమారుడిపై ఫిర్యాదు చేశాడు. విషయం తెలుసుకున్న రాజశేఖర్‌ ఆత్మహత్య చేసుకోవాలని భావించి మెదక్‌ జిల్లా అక్కన్నపేట రైల్వేస్టేషన్‌కు వెళ్లి పట్టాలపై పడుకొని సెల్ఫీ ఫొటోను తన మిత్రుడికి పంపించాడు. వెంటనే సదరు మిత్రుడు ఈ విషయాన్ని గ్రామస్తులకు, నర్సింలుకు తెలియజేశాడు. అప్రమత్తమైన గ్రామస్తులు, నర్సింలు, ఆయన భార్య సత్తవ్వలు పోలీసులకు సమాచారం అందించి అక్కన్నపేట రైల్వేస్టేషన్‌కు వెళ్లారు. గ్రామస్తులు పోలీసులు ఒకవైపు, నర్సింలు ఆయన భార్య సత్తవ్వ మరో వైపు వెతకడం ప్రారంభించారు. పోలీసులకు గ్రామస్తులకు రాజశేఖర్‌ కనిపించగా పట్టుకున్నారు. ఇంకో వైపు వెతు కున్న నర్సింలును అదే సమయంలో వస్తున్న రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తనయు ని ఆచూకీ కోసం వెళ్లిన తండ్రి మృతి చెందడంతో భాగిర్తిపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

విద్యార్థులను ప్రోత్సహించేందుకు పోటీలు


బుక్‌ లెట్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

నర్సాపూర్‌: సివిల్‌ ఇంజనీరింగ్‌ విభాగం విద్యార్థులను ప్రోత్సహించేందుకే తమ కాలేజీలో విష్ణు నేషనల్‌ కాంక్రీట్‌ కానో–2025 పోటీలు నిర్వహిస్తున్నట్లు శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్‌ సొసైటీ చైర్మన్‌ విష్ణురాజు తెలిపారు. నేటి నుంచి రెండు రోజుల పాటు జరిగే పోటీల బుక్‌లెట్‌ను బుధవారం కాలేజీ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సివిల్‌ ఇంజనీరింగ్‌ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించేందుకు అద్భుతమైన అవకాశమని అన్నారు. కాంక్రీట్‌ పడవల నిర్మాణం, డిజైన్‌, బరువు, బలం తదితర టెక్నికల్‌ ప్రామాణికతతో పడవల పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. కాలేజీ డైరెక్టర్‌ లక్ష్మీ ప్రసాద్‌ మాట్లాడుతూ.. పోటీల్లో 16 జట్లు పాల్గొననున్నాయని పేర్కొన్నారు. బుక్‌ లెట్‌ ఆవిష్కరణ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్‌ సంజయ్‌ దూబె, సివిల్‌ ఇంజనీరింగు విభాగం హెడ్‌ కృష్ణ, డీజీఎం కాంతారావు, మేనేజర్‌ బాపిరాజు, ఏటలు అశోక్‌రెడ్డి, సురేశ్‌, తదితరులు పాల్గొన్నారు.

శివ్వంపేటలో నకిలీ ఏఈ హల్‌చల్‌

- విద్యుత్‌ మీటర్లు ఇప్పిస్తానంటూ డబ్బులు వసూలు
- పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు


నకిలీ ఏఈని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్తున్న కార్మికుడు

శివ్వంపేట(నర్సాపూర్‌): మండల పరిధి లింగోజిగూడ గ్రామంలో నకిలీ ఏఈ హల్‌చల్‌ చేశాడు. విద్యుత్‌ మీటర్లు ఇప్పిస్తానంటూ గ్రామస్తుల నుంచి డబ్బులు వసూళ్లకు పాల్పడుతుండటంతో గుర్తించి పోలీసులకు అప్పగించారు. ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి కథనం మేరకు.. మండల పరిధి సమ్య తండాకు చెందిన కాట్రోత్‌ సురేశ్‌ తాను కరెంటు ఏఈనని రూ.250 చెల్లిస్తే కొత్త మీటర్‌ ఇప్పిస్తానని గ్రామస్తులను నమ్మించాడు. కొందరికి అనుమానం వచ్చి విద్యుత్‌ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సీనియర్‌ లైన్‌ ఇన్‌స్పెక్టర్‌ చంద్రశేఖర్‌, స్థానిక లైన్‌మెన్‌ గోదూరి సురేశ్‌ గ్రామానికి చేరుకొని వివరాలు సేకరించారు. సదరు వ్యక్తితో విద్యుత్‌ శాఖకు ఎలాంటి సంబంధం లేదని తేల్చారు. ఇదే వ్యక్తి 5 రోజుల కిందట లైన్‌మెన్‌ గోదూరి సురేశ్‌కు ఫోన్‌ చేసి గోమారం 400 కేవీ విద్యుత్‌ ఏఈని మాట్లాడుతున్నాని పలు గ్రామాల్లో మీటర్లు లేకుండా విద్యుత్‌ వినియోగం జరుగుతుంటే మీరు ఏం చేస్తున్నారని ప్రశ్నించాడు. ప్రజలను విద్యుత్‌ మీటర్ల పేరిట మోసం చేస్తున్న విషయం గురించి విద్యుత్‌ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గ్రామానికి చేరుకున్న నకిలీ ఏఈని అరెస్ట్‌ చేసి కేసు నమోదు చేశారు.

మంత్రి పీఏనంటూ వేధిస్తున్న వ్యక్తి అరెస్ట్‌

- మహిళలకు ఫోన్‌ చేసి డబ్బులు డిమాండ్‌ చేస్తున్న నిందితుడు
- ఇవ్వని వారికి లైంగికంగా వేధింపులు


నిందితుడు యాదగిరి

కోదాడరూరల్‌: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పీఏనంటూ మహిళలకు ఫోన్‌ చేసి వేధిస్తున్న వ్యక్తిని బుధవారం సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వివరాలను కోదాడ డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి విలేకరులకు వెల్లడించారు. మెదక్‌ జిల్లా తుప్రాన్‌ మండలం కోనాయిపల్లికి చెందిన పంది యాదగిరి హైదరాబాద్‌లో ప్రైవేట్‌ ఉద్యోగం చేస్తున్నాడు. ఆరు నెలల కిందట గూగుల్‌లో సెర్చ్‌ చేసి ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్ల ఫోన్‌ నంబర్లను తీసుకొని తాను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పీఏనని చెప్పి డబ్బులు డిమాండ్‌ చేయడం మొదలుపెట్టాడు. డబ్బులు ఇవ్వని వారిని అసభ్య పదజాలంతో దూషిస్తూ, లైంగికంగా వేధిస్తున్నాడు. కోదాడకు చెందిన ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ సూర్యకళతోపాటు హుజూర్‌నగర్‌, మేళ్లచెర్వు, నూతనకల్‌, నేరేడుచర్ల సూపర్‌వైజర్లకు కూడా రెండు నెలల కిందట ఫోన్‌ చేసి తాను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పీఏ నరేశ్‌రెడ్డిని అని చెప్పి లైంగికంగా వేధించడంతో బాధితులు ఆయా పోలీస్‌ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు విచారణ చేపట్టారు. బుధవారం యాదగిరి హైదరాబాద్‌ నుంచి విజయవాడకు బస్సులో వెళ్తున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో కోదాడలో అదుపులోకి తీసుకొని విచారించగా నిజం ఒప్పుకున్నాడు. నిందితుడి వద్ద సెల్‌ఫోన్‌ స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. విలేకరుల సమావేశంలో కోదాడ పట్టణ సీఐ రాము, ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి, ఐడీ పార్టీ సిబ్బంది బాలు, శ్రీనివాస్‌, రామారావు, సతీష్‌నాయుడు, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

గణితం పోటీల్లో మెరిసిన విద్యార్థులు

సత్తా చాటిన లలిత్‌కుమార్‌


విద్యార్థికి మెమెంటో అందజేస్తున్న ప్రిన్సిపాల్‌ దినేశ్‌


విద్యార్థిని అభినందిస్తున్న చైర్మన్‌ భగవాన్‌ రెడ్డి

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): అలామా వరల్డ్‌ వైడ్‌ కాంపిటీషన్‌లో అబాకస్‌–మెంటల్‌ అర్థమెటిక్‌లో జిల్లా కేంద్రంలోని మెరిడియన్‌ పాఠశాల విద్యార్థి లలిత్‌కుమార్‌ మొదటి స్థానంలో నిలిచాడని పాఠశాల చైర్మన్లు దేవేందర్‌రెడ్డి, రాజా వెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం పాఠశాలలో లలిత్‌ కుమార్‌ను పాఠశాల ప్రిన్సిపాల్‌ దినేష్‌ ఆధ్వర్యంలో అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మంది విద్యార్థులు ఈ పోటీల్లో ఆన్‌లైన్‌లో పాల్గొన్నారని, వీరందరిలో లలిత్‌కుమార్‌ విజయం సాధించడం గర్వంగా ఉందన్నారు.

సిద్దిపేట నుంచి హర్షవర్ధన్‌ రెడ్డి

సిద్దిపేటజోన్‌: స్థానిక క్రాంతి పాఠశాల విద్యార్థి హర్షవర్ధన్‌ రెడ్డి గణితంలో అవార్డు సాధించాడు. హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన అలమా వరల్డ్‌ వైడ్‌ కాంపిటీషన్‌ 2025లో విజేతగా నిలిచాడు. ఈ పోటీల్లో అబకాస్‌ తదితర అంశాలపై నైపుణ్యాలను పరీక్షించారు. ఈ మేరకు పాఠశాల చైర్మన్‌ భగవాన్‌ రెడ్డి అభినందించారు.

నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలి

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ దామోదర్‌


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్‌ దామోదర్‌

నర్సాపూర్‌ రూరల్‌: నూతన ఆవిష్కరణలపై విద్యార్థులు దృష్టి పెట్టాలని నర్సాపూర్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ దామోదర్‌ విద్యార్థులకు సూచించారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి యువజన ఉత్సవాల్లో నర్సాపూర్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సేంద్రియ వ్యవసాయంలో భాగంగా పంటలపై సోకే చీడపీడల నివారణ కోసం తయారుచేసిన ప్రాజెక్ట్‌ ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా ప్రాజెక్ట్‌ తయారు చేసిన విద్యార్థులను బుధవారం అభినందించారు. అనంతరం ప్రిన్సిపాల్‌ మాట్లాడుతూ.. తమ కళాశాలలో బీఎస్సీ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఎం. శైలజ, కే. పవన్‌ బృందం సభ్యులు 7న హైదరాబాద్‌ లో జరిగిన రాష్ట్రస్థాయి యువజన ఉత్సవాల్లో పాల్గొన్నారు. పంటలపై సోకే పీడపీడల నివారణ కోసం తక్కువ ఖర్చుతో ఆయా రకాల మొక్కల ఆకులు, పేడతో తయారుచేసిన ద్రవాన్ని పిచికారీ చేసే ప్రాజెక్ట్‌ను తయా రు చేసి ప్రదర్శించారు. విద్యార్థులతోపాటు ప్రాజెక్ట్‌కు సహకరించిన లెక్చరర్‌ రుక్మిణిని అభినందించారు. కార్యక్రమంలో లెక్చరర్లు డాక్టర్‌ సురేశ్‌ కుమార్‌, సమీరా, రమేశ్‌, శ్రీనివాస్‌, హేమంత్‌, మహేందర్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వెనుకాల గంజాయి సాగు

వ్యక్తి అరెస్ట్‌, మొక్కలు స్వాధీనం


మాట్లాడుతున్న ఎస్‌ఐ షేక్‌ మహబూబ్‌

మద్దూరు(హుస్నాబాద్‌): మండలంలోని నర్సాయపల్లి గ్రామంలో పోలీసుల గంజాయి పట్టుకున్నారు. ఎస్‌ఐ షేక్‌ మహబూబ్‌ కథనం మేరకు.. గ్రామానికి చెందిన మహ్మద్‌ షబ్బీర్‌ కొద్ది రోజులుగా ఇంటి వెనుకాల ఉన్న భూమిలో గంజాయి మొక్కలను పెంచుతున్నాడు. గంజాయి మొక్కల నుంచి తీసిన ఆకులను ఎండబెట్టి వాటిని బిహార్‌కు చెందిన కూలీలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు. పోలీసులకు అందిన సమాచారంతో షబ్బీర్‌ ఇంటితో పాటు పరిసరాలను తనిఖీ చేసి రెండు గంజాయి మొక్కలతోపాటు 38 గ్రాముల గంజాయిని టాస్క్‌ఫోర్స్‌, మద్దూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి చేర్యాల సీఐ శ్రీను ఆధ్వర్యంలో విచారణ చేపట్టి నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

చెరువులో దూకి వృద్ధురాలు ఆత్మహత్య

రామాయంపేట(మెదక్‌): చెరువులో దూకి వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని ప్రగతి ధర్మారం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన నక్కని ఎల్లవ్వ (60) బుధవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుతున్నారు. ఈ క్రమంలో ఆమె కప్పుకున్న శాలువ చెరువు కట్ట తూమ్‌ వద్ద లభించింది. చెరువులో గాలించగా మృతదేహం బయటపడింది. జీవితంపై విరక్తి చెంది తన తల్లి ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి కుమారుడు నక్కని చిన్నస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాల్‌రాజు తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి..

గజ్వేల్‌రూరల్‌: కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని జాలిగామలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పర్కి సుమన్‌(33)కు భార్య ప్రభతోపాటు ఆరేళ్లలోపు ఇద్దరు కుమారులు, కూతురు ఉంది. సుమన్‌తోపాటు కుటుంబ సభ్యులు భూమిని విక్రయించగా వచ్చిన డబ్బుతో ఇంటి నిర్మాణం చేపట్టారు. మరికొంత డబ్బును తెలిసిన వారి వద్ద ఉంచారు. డబ్బుల విషయంలో కుటుంబంలో మనస్పర్థలు వచ్చి 5వ తేదీన సుమన్‌ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా మంగళవారం మృతి చెందాడు. తన చావుకు వీరే కారణమంటూ గ్రామానికి చెందిన కొందరి పేర్లను రాసి ఇదే తన మరణవాంగ్మూలమని మూడ్రోజుల కిందట గ్రామంలోని ఓ వాట్సాప్‌ గ్రూప్‌లో పోస్టు చేయగా అది వైరల్‌గా మారిందని గ్రామస్తుల ద్వారా తెలిసింది. కుటుంబ కలహాలతో సుమన్‌ ఆత్మహత్యకు పాల్పడ్డాడని బుధవారం బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉరేసుకొని బాలుడు..

కల్హేర్‌(నారాయణఖేడ్‌): ఉరేసుకొని బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం మేరకు..మండలంలోని ఖానాపూర్‌(కె) గ్రామానికి చెందిన వెంకయ్య కుమారుడు శివ(17) బుధవారం గ్రామ సమీపంలో మామిడి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శివ ఆత్మహత్యకు కుటుంబ కలహాలే కారణమని తెలిసింది. బాలుడి ఆత్మహత్యపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన బస్సు

ఒకరికి తీవ్ర గాయాలు



కల్హేర్‌(నారాయణఖేడ్‌): బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన నిజాంపేట మండలం బాచేపల్లి వద్ద బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశం కథనం మేరకు.. నారాయణఖేడ్‌ మండలం ర్యాలమడుగు గ్రామానికి చెందిన పాండు మోటార్‌ సైకిల్‌పై నిజాంపేట్‌ వైపు వెళ్తున్నాడు. పిట్లం నుంచి వస్తున్న హైదరాబాద్‌–2 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న పాండుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం నారాయణఖేడ్‌ ఆస్పత్రికి తరలించారు. అలాగే బస్సు పక్కనే ఆటోను ఢీకొట్టింది. డ్రైవర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వెంకటేశం తెలిపారు.

వైద్య సేవలపై కేంద్ర బృందం ఆరా

- ఎన్‌సీడీ సేవలను పరిశీలించిన కేంద్ర వైద్యారోగ్య కుటుంబ, సంక్షేమ శాఖ అధికారులు
- సిద్దిపేట ప్రభుత్వాసుపత్రి, పీహెచ్‌సీలు, బస్తీ దవాఖాన తనిఖీ


డయాలసిస్‌ సెంటర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

సిద్దిపేటకమాన్‌/ వర్గల్‌(గజ్వేల్‌)/ములుగు(గజ్వేల్‌): సిద్దిపేట ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రి, పీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాలో అందుతున్న ఎన్‌సీడీ వైద్య సేవలను కేంద్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీడీ ప్రోగ్రామ్‌ అధికారులు బుధవారం పరిశీలించారు. అసంక్రమిత వ్యాధులపై హైదరాబాద్‌లో జరుగుతున్న జాతీయ సెమినార్‌లోఈ పరిశీలనకు వచ్చారు. ఉత్తర ప్రదేశ్‌ ప్రిన్సిపల్‌ సెక్రటరీ పార్థసారథిసేన్‌ శర్మ, రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కమిషనర్‌ ఆర్‌వీ కర్నన్‌, మేనేజింగ్‌ డైరెక్టర్‌ ఆరాధన పట్నాయక్‌, చత్తీస్‌ఘడ్‌ నేషన్‌ హెల్త్‌ మిషన్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ విజయ్‌ దయరామ్‌, రాజస్థాన్‌ హెల్త్‌ మిషన్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ భారతి దీక్షిత్‌, ఇంద్రాణి కౌషల్‌, నాగాలాండ్‌ ఎన్‌హెచ్‌ఎం అకొసరహితోపాటు వివిధ రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీడీ కార్యక్రమ అధికారులు సిద్దిపేట ప్రభుత్వ మెడికల్‌ కళాశాల అనుబంధ జనరల్‌ ఆస్పత్రిలోని ఎన్‌సీడీ సెంటర్‌, తెలంగాణ డయాగ్నోస్టిక్‌ హబ్‌, డయాలసిస్‌ సెంటర్‌, సిద్దిపేట అర్బన్‌ నాసర్‌పూర్‌ పీహెచ్‌సీ, బస్తీ దవాఖానలను పరిశీలించారు. జిల్లాలో అసంక్రమిత వ్యాధుల వైద్య సేవల కోసం ప్రభుత్వం కల్పించిన వైద్య సౌకర్యాలు, వైద్య సేవలను కలెక్టర్‌ మనుచౌదరి వారికి వివరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ పల్వన్‌కుమార్‌, ప్రోగ్రామ్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ శ్రీకాంత్‌ యాదవ్‌, మెడికల్‌ కళాశాల డైరెక్టర్‌ విమలాథామస్‌, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్‌ సైకియాట్రీ విభాగ హెచ్‌ఓడీ డాక్టర్‌ శాంతి, ఆర్‌ఎంఓలు డాక్టర్‌ శాంతి, డాక్టర్‌ జ్యోతి, డాక్టర్‌ శ్రావణి, వైద్యులు, సిబ్బంది రాజేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

వర్గల్‌, నెంటూరు సందర్శన


వర్గల్‌(గజ్వేల్‌): నెంటూరు పల్లె దవాఖాన వద్ద కేంద్ర బృందంతో స్థానిక వైద్యసిబ్బంది

బీపీ, షుగర్‌ తదితర అసంక్రామిత వ్యాధులపై హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న రెండ్రోజుల జాతీయ వర్క్‌షాప్‌లో భాగంగా బుధవారం వర్గల్‌ మండలం నెంటూరు ఆయుష్మాన్‌ ఆరోగ్యమందిర్‌(పల్లె దవాఖాన)ను కేంద్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ అధికారుల బృందం సందర్శించింది. అలాగే, కేంద్ర బృందం ఉదయం వర్గల్‌ సరస్వతీ క్షేత్రం సందర్శించింది. వారికి స్థానిక వైద్యాధికారిణి డాక్టర్‌ హరిత ఆధ్వర్యంలో సాదర స్వాగతం పలికారు. వారు అమ్మవారిని దర్శించుకొని, వేదాశీర్వచనం పొందారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే, ములుగు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, మామిడ్యాల సబ్‌సెంటర్‌ను కేంద్ర బృందం సందర్శించింది.